క్లుప్తంగా

నేడు అన్నవరంలో గడప గడపకు మన ప్రభుత్వం

జలదంకి: మండలంలోని అన్నవరం పంచాయతీలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి మంగళవారం తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి హాజరు అవుతారన్నారు. మండలంలోని అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పారదర్శకంగా తనిఖీ

ఉదయగిరి: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీని పారదర్శకంగా నిర్వహించాలని ఏపీడీ గాయత్రీదేవి సూచించారు. ఆమె మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో క్షేత్ర సహాయకులు, సామాజిక తనిఖీ బృందంతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.8.20 కోట్ల మేర ఉపాధి హామీ పనులు జరిగాయన్నారు. ఈ పనులపై క్షేత్ర స్థాయిలో సామాజిక తనిఖీ బృందం పరిశీలన చేపట్టి పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహిస్తుందన్నారు. తనిఖీ బృందానికి అన్ని రికార్డులు అప్పగించడం జరిగిందన్నారు. క్షేత్ర సహాయకులు తనిఖీ బృందానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాసులు, ఎస్‌ఆర్పీ వెంకయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ పథకాలపై అవగాహన

సంగం: ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా సంగంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, జెడ్పీ హైస్కూల్‌లో ఆత్మకూరు సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజగోపాల్ తపాలా శాఖ పథకాలపై అవగాహన కల్పించారు. తపాలాశాఖ పథకాలను వారికి తెలియజేసి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తపాలాశాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, సేవలు వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల్లోకి తీసుకెళ్లి భాగస్వాములను చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

విద్యుత్ సరఫరా వేళల్లో తాత్కాలిక మార్పు

కలిగిరి: కృష్ణపట్నంలోని పవర్ జనరేషన్ యూనిట్ ఫెయిల్ అయిన నేపథ్యంలో బుధవారం, గురువారం విద్యుత్ సరఫరాలో స్వల్ప అంతరాయం కలుగుతుందని, వ్యవసాయ విద్యుత్ సరఫరాలో తాత్కాలిక మార్పులు ఉంటాయని ట్రాన్స్‌కో ఏఈ దినేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. వ్యవసాయానికి ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నాలుగు గంటల పాటు మాత్రమే విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. రాత్రి సమయంలో రెండు నుంచి మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేసే అవకాశం ఉందన్నారు. పవర్ జనరేషన్ యూనిట్ సమస్య పరిష్కారం అయిన వెంటనే యథావిధిగా విద్యుత్ సరఫరా కొనసాగిస్తామన్నారు.

సంగం చేరిన పాదయాత్ర

సంగం: జిల్లా సమగ్రాభివృద్ధి పేరుతో సీపీఎం జిల్లా సరిహద్దు నుంచి చేపట్టిన పాదయాత్ర మంగళవారం రాత్రి సంగం బస్టాండ్ సెంటర్‌కు చేరుకుంది. పట్టణ సీపీఎం నాయకులు పాదయాత్రకు ఘన స్వాగతం పలికారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో కృష్ణపట్నం, రామాయపట్నం మినహా ఏ పరిశ్రమలు లేవని తెలిపారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. జిల్లా నాయకులు వెంకమరాజు, సురేష్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష మెగా శిబిరం రేపు

ఆత్మకూరు: ప్రతి ఒక్కరి ఆరోగ్యం సంరక్షించడమే ధ్యేయంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పూర్తయిన క్రమంలో ఆత్మకూరు పట్టణంలోని అర్బన్ హెల్త్ కేంద్రంలో గురువారం ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బల్లి నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్ సూచనల మేరకు మున్సిపల్ పరిధిలోని 23 వార్డుల ప్రజలకు అందుబాటు అయ్యేలా మూడు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో మొదటిది గురువారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు. రెండవ వైద్య శిబిరం 16వ తేదీ, 3వ వైద్య శిబిరం 18వ తేదీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించనున్నటు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

సంగం: సంగం కొండ మలుపు వద్ద సోమవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన దుత్తలూరుకు చెందిన యువకుడు నెల్లూరులో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. దుత్తలూరుకు చెందిన లక్ష్మి రమేష్ దంపతుల రెండో కుమారుడు చింతలపూడి ఏడుకొండలు (26) స్థానికంగా నాయీబ్రాహ్మణ వృత్తి చేసుకుంటూ ఉన్నాడు. ఏం జరిగిందో ఏమో కాని సోమవారం దుత్తలూరు నుంచి కుటుంబ సభ్యులకు చెప్పకుండా వచ్చి గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకుంటూ కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశాడు. దీంతో కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని ఏడుకొండలను నెల్లూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు ఎస్సై నాగార్జునరెడ్డి ఆస్పత్రికి చేరుకుని ఏడుకొండలు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదల వైద్యానికి పెద్దపీట



బసినేనిపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఆరోగ్యశ్రీ రాష్ట్ర ప్రత్యేకాధికారి అశోక్‌బాబు

• ఆరోగ్యశ్రీ రాష్ట్ర ప్రత్యేకాధికారి అశోక్‌బాబు

సీతారామపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్యానికి పెద్ద పీట వేసి, పేదలకు ఎన్నో రకాల వైద్య సేవలను ఉచితంగా అందుబాటులోకి తెచ్చారని ఆరోగ్యశ్రీ రాష్ట్ర ప్రత్యేకాధికారి అశోక్‌బాబు అన్నారు. ఆయన మండలంలోని బసినేనిపల్లిలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయని విధంగా వైద్య రంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త చరిత్రను సృష్టించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చింతంరెడ్డి సుబ్బారెడ్డి, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు, జేసీఎస్ మండల కన్వీనరు బాలినేని మాబయ్య, సర్పంచ్ పల్లె విజయమ్మ, వైద్యులు స్వప్న, రిటైర్డ్ సీటీఓ వెంకటరత్నం, నాయకులు గాజులపల్లి రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ఉదయగిరి: రాష్ట్ర ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వ నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గానుగపెంట ఓబుల్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కల్లూరి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని వెంగళరావునగర్‌లో మంగళవారం సర్పంచ్ మొండ్రు తిరుపతి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ, తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి, ఈఓపీఆర్డీ మల్లికార్జున, కార్యదర్శి జి.అమర్‌నాథ్‌రెడ్డి, వైద్యాధికారి వినీత, మాజీ సర్పంచ్‌లు కె.అబ్దుల్, మహ్మద్‌ఖాజా తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అందరికీ ఆరోగ్యం

దుత్తలూరు: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలందుతున్నాయని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి అన్నారు. ఆయన మంగళవారం మండలంలోని కొత్తపేటలో జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించి ఆరోగ్య పరీక్షలు చేశారు. కమ్మవారిపాళెం సొసైటీ అధ్యక్షుడు వెంగయ్యచౌదరి, వెంగనపాళెం సర్పంచ్ తిప్పిరిబోయిన వెంగయ్య, జేసీఎస్ మండల కన్వీనరు అన్నంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ దయానందం, ఎంపీడీఓ సాయిప్రసాద్, నాయకులు శ్రీహరినాయుడు, తిరుపాల్‌నాయుడు, చెన్నకేశవులు పాల్గొన్నారు.

తిమ్మారెడ్డిపల్లెలో..

వరికుంటపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. మాజీ ఏఎంసీ చైర్మన్ షేక్ ఆలీ అహ్మద్, సొసైటీ అధ్యక్షుడు జి.రామాంజనేయులు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు శ్రీరామరక్షగా నిలుస్తుందన్నారు. ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి, సర్పంచ్ ఎం.నారాయణమ్మ, ఎంపీటీసీ కె.వసంతకుమారి, మండల కో–ఆప్షన్ సభ్యుడు జిలానీ, సొసైటీ డైరెక్టర్ జక్కం శ్రీనివాసులురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బి.వెంకటేశ్వరరెడ్డి, సచివాలయ కన్వీనర్ జి.రమేష్‌బాబు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఎం.శ్రీనివాసులు, మాజీ మండల కన్వీనర్ ఎం.తిరుపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య భద్రతకే జగనన్న సురక్ష

దగదర్తి (కావలి): పేదల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష అనే విప్లవాత్మక పథకానికి శ్రీకారం చుట్టినట్లు దగదర్తి ఎంపీపీ తాళ్లూరి ప్రసాద్‌నాయుడు అన్నారు. మండలంలోని కాట్రాయపాడులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రత్యేక కౌంటర్లు, వ్యాధి నిర్ధారణ కేంద్రాలు ఏర్పాటు చేసి వైద్యులు వైద్య సేవలు అందించారు. ఎంపీపీ ప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ సచివాలయాలు, వలంటీర్లు వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజల ముంగిటకే తీసుకువెళ్లిన ప్రభుత్వం తాజాగా జగనన్న సురక్ష ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని కూడా నేరుగా గ్రామాలకే తీసుకు వచ్చిందని తెలిపారు.

ప్రజల ఆరోగ్యమే లక్ష్యం

ఆత్మకూరురూరల్: గ్రామ స్థాయి నుంచి ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష అమలు చేస్తోందని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామస్వామిపల్లిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల అధ్యక్షుడు వల్లభనేని రాజేంద్ర, ఆత్మకూరు సొసైటీ చైర్మన్ సానా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, ఈఓఆర్‌డీ ఉషారాణి, ఏఓ శ్రీనివాసరావు, మహిమలూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు దేవానంద్, అనూషా, స్థానిక నేత సంపతి వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి ఆరోగ్యం

సంగం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికి ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని వైఎస్సార్‌సీపీ నేత కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని మర్రిపాడులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్షను తహసీల్దారు నాగరాజు పరిశీలించారు. హెల్ప్ డెస్క్‌లను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, జేసీఎస్ కో–ఆర్డినేటర్ ముడి మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు మెట్టుకూరు వాసుదేవరెడ్డి, ప్రసాద్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు ఒక వరం

చేజర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిభిరం ప్రజలకు ఒక వరమని ప్రజా ప్రతినిధులు, అధికారులు తెలిపారు. మంగళవారం చేజర్ల మండలంలోని పాతపాడులో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా, సర్పంచ్ అల్లంపాటి స్రవంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు చిరంజీవిరెడ్డి వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, కొండా భాస్కర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ పాల్గొన్నారు.

• అనంతసాగరం మండలం మంచాలపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, ఎంపీడీఓ మధుసూదన్‌రావు, సర్పంచ్ డి మస్తానమ్మ, నాయకులు దశరథరామిరెడ్డి వైద్యులు పాల్గొన్నారు.

ప్రజలందరి ఆరోగ్యమే జగనన్న లక్ష్యం

అల్లూరు: రాష్ట్రంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్ అన్నారు. మండలంలోని నార్త్‌మోపూర్ పంచాయతీలో జగనన్న సురక్ష క్యాంపును మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్, నాయకుల మధురెడ్డి, వెంకటేశ్వర్లు, భాస్కర్, షేక్ ఉస్మాన్, కరుణాకర్, భక్తవత్సలరెడ్డి, పోలయ్య, సుధ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు రూరల్: మెడికల్ కిట్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు



కావలి: కాట్రాయపాడులో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ ప్రసాద్ నాయుడు



ఉదయగిరి: మాట్లాడుతున్న ఓబుల్‌రెడ్డి



దుత్తలూరు: ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న నాయకులు



మడపల్లిలో లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

మన పోరాటం పేదరికం పైనే

• సంక్షేమ ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదం
• ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

చేజర్ల: పేదరికం నిర్మూలనే ధ్యేయంగా ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్నారని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మన పోరాటం పేదరికం పైనే కానీ ప్రతిపక్షాలపై కాదన్నారు. మంగళవారం మండలంలోని మడపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అంకమ్మతల్లి, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ప్రతి గడపకు వెళ్లిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మడపల్లి సచివాలయ పరిధిలో రూ.1.5 కోట్ల మేర అభివృద్ధి, సంక్షేమ పనుల ద్వారా ఖర్చు చేశామన్నారు. గత ప్రభుత్వంలో ఇంత స్థాయిలో అభివృద్ధి జరగలేదున్నారు. రాష్ట్రంలో రూ.2.35 లక్షల కోట్ల అభివృద్ధి, సంక్షేమ పథకాల ఒక్క రూపాయి అవినీతి జరగకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అందజేశారని తెలిపారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు సంక్షేమాన్ని ప్రజల దృష్టి నుంచి దారి మళ్లించేలా తమ చానెళ్ల, పత్రికల ద్వారా ప్రచారాలు చేసుకుంటున్నాయన్నారు. మన ప్రభుత్వం ప్రతి ఇంటికి అందజేసిన సంక్షేమం ప్రజలకు తెలుసునన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 175కి 175స్థానాలు వస్తాయన్నారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల వద్దకే వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చి అవసరమైన మందులు ఇస్తున్నారన్నారు. రానున్న రెండు మూడు నెలల్లో రెవెన్యూ సమస్యలన్నింటిని పరిష్కరించేలా చర్యలు తీసుకొంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ తిరుపతినాయుడు, మాజీ ఎంపీపీ శ్రీనివాసులునాయుడు, జేసీఎస్ కన్వీనర్ పూనూరు బాలగంగాధర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, సర్పంచ్ ఎం.వెంకటమ్మ, వైస్ ప్రెసిడెంట్ పి కొండారెడ్డి, ఎంపీటీసీ పూనూరు భారతి, వైఎస్సార్‌సీపీ నేత పి.రామమనోహర్‌రెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పోలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మెంబర్ ఎర్రగుంట పెంచలయ్య, నాయకులు, చంద్రశేఖర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి గోతం వెంకటసుబ్బయ్య, రవీంద్రనాయుడు, వంగవరపు ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన



అన్నవరంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి, మాలకొండారెడ్డి

• ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

జలదంకి : రాష్ట్రంలో అవినీతి రహిత సంక్షేమ పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని అన్నవరం పంచాయతీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. తొలుత వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి పాలవల్లి మాలకొండారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు రాజగోపాల్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని ఆరాతీశారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గత నాలుగేళ్ల కాలంలో సంక్షేమ పథకాల రూపంలో కోట్లాది రూపాయలు లబ్ధిదారులకు చేరిందని, దీనివల్ల ప్రజల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి విశేషాదరణ లభిస్తోందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువైందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా సంఘాల మహిళలకు రుణాలను సీఎం జగన్ మూడు విడతల్లో మాఫీ చేశారని గుర్తుచేశారు. ప్రతినెలా ఒకటో తేదీనే వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికే వెళ్లి సామాజిక పింఛన్లను అందజేస్తున్నట్లు వివరించారు. ఇలా అన్నివర్గాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మేలు జరుగుతోందని తెలియజేశారు. ప్రస్తుతం జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్ బాబు, తహసీల్దార్ పద్మావతి, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మేదరమెట్ల శివలీల, సొసైటీ డైరెక్టర్లు ఇస్కా మదన్‌మోహన్ రెడ్డి, గొట్టిపాటి ప్రసాద్, సర్పంచ్ గుమ్మడి మార్తమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు రావి ప్రసాద్‌నాయుడు, తమ్మినేని సతీష్‌నాయుడు, గుర్రం ధనుష్ నాయుడు, గుమ్మడి రమేష్, దామెర్ల దేవదాస్, ఆలూరు నరసారెడ్డి, కోర్శిపాటి రామిరెడ్డి, సురె వెంకటశేషారెడ్డి, చేజర్ల హరిబాబురెడ్డి, దేవరపల్లి మధుసూదన్‌రెడ్డి, డాకా గోపాల్‌రెడ్డి, చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, అన్నవరం పిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడు నీలం హజరత్తయ్య పాల్గొన్నారు.

రహదారి భద్రత అందరి బాధ్యత

• కళాశాల విద్యార్థులకు అవగాహన

ఆత్మకూరు: వాహనాలు నడిపే సమయంలో రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని రహదారిపై భద్రత ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఆత్మకూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాములు అన్నారు. పట్టణంలోని ఎస్‌ఆర్‌జేడీ కళాశాలలో మంగళవారం రోడ్డు భద్రత వారోత్సవాలపై (స్వచ్ఛత పక్వాడ 2023) కళాశాల విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, వాహనం నడిపే సమయంలో అజాగ్రత్తగా ఉండరాదని సూచించారు. విద్యార్థులు సైతం వేగానికి ప్రాముఖ్యత ఇస్తారని, అది సరికాదన్నారు. భద్రతతో కూడిన వాహన డ్రైవింగ్ జీవితాలను ఆనందమయంగా చేస్తుందన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఆ సమాచారాన్ని అధికారులకు తెలియజేయడంతో పాటు ప్రమాదంలో గాయపడిన వారిని ఆస్పత్రులకు చేర్చాలని కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు అలా సహాయపడిన వారికి రూ.5 వేలు ప్రోత్సాహకంగా అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు, కరస్పాండెంట్ వెంకట సుబ్బయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఆత్మకూరు ఎస్‌ఆర్‌జే కళాశాలలో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రాములు

గంధ మహోత్సవం విజయవంతానికి సహకరించండి

అనుమసముద్రంపేట: పవిత్ర పుణ్యక్షేత్రం హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గా 250వ గంధ మహోత్సవానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని వక్ఫ్ బోర్డు ఈఓ హుస్సేన్ తెలిపారు. మంగళవారం దర్గాలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆదేశాలు, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలతో గంధమహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఇప్పటికే అన్ని శాఖల అధికారులతో గంధ మహోత్సవంపై సమీక్షించి తగు సూచనలు చేశారన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది ప్రతి భక్తుడికి గంధం అందాలన్న ఆలోచనతో దర్గా ప్రాంగణంలో గంధం సైతం ఏర్పాటు చేయగా క్యూలైన్లలో నిల్చున్న భక్తులకు వాటర్ ప్యాకెట్లు సైతం క్యూలైన్ల వద్దే దర్గా సిబ్బంది అందించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మూడు రోజుల పాటు నిత్యాన్నదానం సైతం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా దర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు, ఇప్పటికే పోలీసు శాఖ తమ ప్రణాళికలను సిద్ధం చేసినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న దర్గా ఈఓ హుస్సేన్

హెచ్‌ఎంకు ఘన సన్మానం



హెచ్‌ఎంను సత్కరిస్తున్న ఎంఈఓ, తదితరులు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం అనంతపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తూ బదిలీపై వెళ్లిన దొందు రత్నయ్యను మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. మర్రిపాడు ఎంఈఓ–2 ధనలక్ష్మి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల బహుముఖ అభివృద్ధికి రత్నయ్య చేసిన సేవలను కొనియాడారు. అనంతరం శాలువా, పూలమాలలు జ్ఞాపికలతో రత్నయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఆర్‌జీ కలిశెట్టి రాజేంద్రకుమార్, కదిరినాయుడుపల్లి స్కూల్ కాంప్లెక్స్ సెక్రటరీ పోలిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, హెచ్‌ఎం వెంకటరెడ్డి, సీఎంఆర్‌టీలు భాగ్యమ్మ, కస్తూరయ్య, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, సహచర ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని దంపతులకు తీవ్రగాయాలు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మోటార్ సైకిల్‌పై వెళ్తున్న గిరిజన దంపతులను ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో మహిళకు కుడికాలు విరిగిపోగా భర్త స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటన మంగళవారం మర్రిపాడు మండలం కోనసముద్రం బస్‌షెల్టర్ వద్ద 67వ నంబరు జాతీయ రహదారిపై జరిగింది. ఆత్మకూరు మండలం కరటంపాడు గిరిజన కాలనీకి చెందిన ఇండ్ల లక్ష్మయ్య, ఇండ్ల విజయమ్మ దంపతులు తెల్లవారు జామున మర్రిపాడు మండలం డీసీపల్లి సమీపంలోని ఏమిలేరువాగు వద్దకు చేపల వేటకు వెళ్లి ఉదయం 9 గంటల ప్రాంతంలో తిరిగి కరటంపాడుకు చేరుకునేందుకు లూనా ఎక్సెల్ వాహనంపై బయలుదేరారు. కోనసముద్రం బస్‌షెల్టర్ వద్ద మలుపు వద్ద బుచ్చిరెడ్డిపాళెం నుంచి బద్వేల్ వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి గిరిజన దంపతుల వాహనాన్ని ఢీకొట్టింది. ఈ క్రమంలో లూనా రోడ్డు పక్కన పడిపోయారు. అటుగా వెళ్తున్న ఆత్మకూరు మండలం వెన్నవాడ సచివాలయం హెల్త్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి గమనించి డీసీపల్లి టోల్‌ప్లాజా వద్ద ఉన్న 1033 వాహనానికి సమాచారం అందించి ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలంలో క్షతగాత్రులు లక్ష్మయ్య, విజయమ్మ

హక్కుల గురించి తెలుసుకోండి

• సీనియర్ సివిల్ జడ్జి బి రాజేష్

ఆత్మకూరు: ప్రజలు రాజ్యాంగం ప్రకారం సంక్రమించిన హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలని సామాన్య ప్రజలతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు పలు హక్కులు వర్తిస్తాయని ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బి రాజేష్ తెలిపారు. పట్టణంలోని అర్బన్ హెల్త్ కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది, సచివాలయాల సిబ్బందికి, మండల న్యాయ సేవా అధికార సంఘం ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు, చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పలువురు చట్టాల గురించి అవగాహన లేక హక్కులను కోల్పోతుంటారని, ఒక్కొక్కసారి న్యాయం సైతం అందుకోలేకపోతారని తెలిపారు. ప్రభుత్వం న్యాయవిజ్ఞాన సదస్సులు ఏర్పాటు చేస్తూ అవగాహన కల్పిస్తోందని, ఈ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ షేక్ అస్మా, హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాజేష్

సమగ్ర ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి

ఉదయగిరి: సమగ్ర ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి సువర్ణమ్మ కోరారు. ఆమె మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఏఈఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపుల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ప్రతి నివాసానికి డోర్ నంబరు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఒక కుటుంబంలోని ఓట్లన్నీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలన్నారు. 1,400 ఓట్లు మించితే అదనంగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలు శిథిలావస్థకు చేరినా, మరమ్మతులు చేయాల్సి ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్వోలు సానా శ్రీనివాసులురెడ్డి షాజియా, రాజకీయ పార్టీల నాయకులు బాలయ్య, వెంకటేశ్వర్లు, బయ్యన్న తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులు పరిశీలిస్తున్న సువర్ణమ్మ

బాలిక అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు

సంగం: మండలంలోని జంగాలదొరువుకు చెందిన ఓ బాలిక సోమవారం నుంచి అదృశ్యమైందని మంగళవారం బాలిక తల్లి సంగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. గ్రామానికి చెందిన ఆదిలక్ష్మమ్మ 17 ఏళ్ల కుమార్తె రెండు రోజులుగా కనిపించలేదు. దీంతో బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మంగళవారం రాత్రి సంగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై నాగార్జునరెడ్డి బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.